క్లుప్తంగా

ప్రశాంతంగా జీవించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

తనకల్లు: గొడవలు, అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని కదిరిరూరల్ సీఐ నాగేంద్ర ప్రజలకు సూచించారు. కొక్కంటిక్రాస్‌లోని చంద్రబాబునాయుడు కాలనీలో శనివారం నాకాబందీ చేపట్టారు. ఎక్సైజ్ కేసుల్లో నిందుతులు, అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వాడకం అనర్థదాయకం



ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కదిరి టౌన్: పొగాకు వాడకం అనర్థదాయకమని డాక్టర్ ఉషారాణి తెలిపారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రి నుం టవర్‌క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ ఉషారాణి పొగాకు వాడకంతో కలిగే నష్టాలను వివరించారు. ప్రజలు పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యులు విశ్వదా, సూపర్‌వైజర్ కృష్ణకళ , శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శివారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: రోడ్డు ప్రమాదం, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బుక్కపట్నం మండలం చుక్కలూరుపల్లికి చెందిన శివారెడ్డి మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోనే చికిత్స పొందుతున్న నల్లమాడ మండలం అరవవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత దుంగావత్ రమేష్‌నాయక్ మామ శంకర్‌నాయక్‌ను దుద్దుకుంట పరామర్శించి త్వరగా కోలుకోవాలి ఆకాక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గశికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ నాగమల్లీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 17 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 17 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునల్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలో కేఎల్ గ్రూప్స్(అమెజాన్ వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్) తరపున రఘునాథరెడ్డి, ఆల్ డిజీ టెక్నికల్ సపోర్ట్ తరపున ఇర్షాద్ అహమ్మద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 78 మంది హాజరుకాగా కేఎల్ గ్రూప్‌లో 11 మందికి, ఆల్ డిజీ టెక్నికల్ సపోర్ట్‌లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఖాద్రీశా పాహిమాం..



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

కదిరి టౌన్: స్థానిక ఖాద్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో శనివారం భక్తుల నరసింహ నామస్మరణతో మార్మోగింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు వేలాది తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామి కాపులు తలనీలాలు సమర్పించుకున్నారు. మహిళలు ఆలయం ముందు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తాదులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి





పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి , దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న ఓడీచెరువు నాయకులు

అమడగూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుదామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అమడగూరు మండల అనుబంధ సంఘాల అధ్యక్షులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా నాయకులంతా కలసికట్టుగా పని చేస్తూ ప్రజల పక్షాన నిలబడుదామన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ దేశాయి భారతిరెడ్డి, జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడు నక్కల రమేష్, జిల్లా యాక్టివ్ సెక్రటరీ హనుమంతరెడ్డి, నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సిభక్తుల్లా, యూత్ వింగ్ మండలాధ్యక్షుడు యశ్‌పాల్, మహిళా విభాగం గంగులమ్మ, రైతు విభాగం రామిరెడ్డి, బీసీ సెల్ లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ గంగాద్రి, ఎస్టీ సెల్ విజయ్‌కుమార్ నాయక్, మైనార్టీ సెల్ అన్వర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ సుధాకర్ రాజు, స్టూడెంట్ వింగ్ మదన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం శంకర, ఆర్‌టీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, వలంటీర్ వింగ్ సురేష్, వాణిజ్య విభాగం గోపాల్‌రెడ్డి, వీవర్స్ వింగ్ విశ్వనాథ్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ విజయదేవరెడ్డి, అంగన్‌వాడీ విభాగం అశ్వనమ్మ, కల్చరల్ వింగ్ ఈశ్వరయ్య, సోషల్ మీడియా వింగ్ సుదర్శన్‌రెడ్డి, వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా ఆంజినేయులు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు అమరనాథరెడ్డి, మండల కన్వీనర్ తనకంటి జయప్ప, వైస్ కన్వీనర్లు ఉత్తప్ప, జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాయక్, హరినాథరెడ్డి, నరసింహులు, వెంకటరెడ్డి, కార్యదర్శులు వెంకటరమణ, దామోదర్‌రెడ్డి, నాగభూషణ, ఆంజినేయులు, ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శ్రీనివాసులు, మనోహర్, సురేంద్రరెడ్డి, ఉత్తప్ప, బాబ్‌జాన్, తిప్పిరెడ్డి, రంగరామప్ప, గోవర్ధన్‌నాయక్, పక్కీరప్ప, చిన్న వెంకటప్ప, శ్రీరాములు, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, నవీన్‌రెడ్డి, చెంద్రాయుడు, మొహిద్దీన్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

ఓడీచెరువు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని రాజునాయుడు, కుర్లి నరిసిరెడ్డి, డి.భారతి, టీడీ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల బీసీసెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రాజునాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుర్లి నరిసిరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి,భారతి, రాష్ట్ర వలంటీర్ విభాగం (సేవాదళ్) జాయింట్ సెక్రటరీ టి.డి విజయ్‌భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం వారు పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంటకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, నాయకులు షామీర్ భాషా, గంగాధర్, రంగారెడ్డి, వీరాంజి, రామచంద్ర, లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపీటీసీ గంగులప్ప తదితరులు పాల్గొన్నారు

'యోగాంధ్ర' నిర్వహణకు పక్కా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ మహేష్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయంలో శనివారం డీఎస్పీ హేమంత్‌కుమార్, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న ధర్మవరంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, డీఎల్‌పీఓ శివకుమారి, ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు, డ్వామా, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికసిత కృషి సంకల్ప అభియాన్



రైతులకు ఆముద విత్తనాలను అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని ముత్యాలచెరువు, మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల గ్రామాల్లో శనివారం కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త మాధవి ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రైతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు తెలియజేశారు. అలాగే భూసార పరీక్షా పత్రాలను రైతులకు అందజేశారు. ఐసీహెచ్-5 ఆముదం విత్తనాలను ఒక్కో గ్రామంలో ఇద్దరేసి అభ్యుదయ రైతులకు అందజేశారు. అనంతరం కేవీకే తయారు చేసిన కరపత్రాన్ని విడుదల చేశారు. జాతీయ నూనె గింజల పరిశోధనా స్థానం నుంచి సీనియర్ శాస్త్రవేత్త డా. మంజునాథ్, సత్యసాయి జిల్లా డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ రామసుబ్బయ్య,ఏడీ అగ్రికల్చర్ సనావుల్లా, ఏఓ శ్రీహరినాయక్, హెచ్ఓ ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపండి



హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్న మబ్బువారిపల్లి రైతులు, మహిళలు

తనకల్లు: తమ పొలాలలకు దారి చూపాలని మబ్బువారిపల్లి గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు గ్రామం సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్ద శనివారం వారు ఆందోళన చేపట్టారు. రైతులు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని హంద్రీ-నీవా కాలువ కారణంగా తాము పొలాలకు వెళ్లడానికి దారి లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పొలాలకు వెళ్లే మార్గంలో ఉన్న హంద్రీ-నీవా కాలువపై బ్రిడ్జి లేదా కల్వర్టును నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పొలాలకు వెళ్లాలంటే డీటీ పల్లి లేదా కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి అక్కడి నుండి పొలాలకు పోవాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామం దగ్గర ఉన్న హంద్రీ-కాలువపై బ్రిడ్జిని నిర్మించి పొలాలకు దారి చూపాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

శక్తివంచన లేకుండా పని చేద్దాం



రాష్ట్ర కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

ఓడీచెరువు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా శక్తివంచన లేకుండా పని చేద్దామని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజునాయుడు పేర్కొన్నారు. రాజునాయుడుతో పాటు వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కుర్లి నరిసిరెడ్డి నియమితులవడంతో శనివారం వారిని పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి మధుసూదన్ నాయుడు, సర్పంచులు తొట్లి రంగారెడ్డి, గోవిందు, జగన్‌మోహన్ చౌదరి, వెంకటరమణ, నాయకులు వెంకటరంగారెడ్డి, అశ్వర్థరెడ్డి, కుర్లి రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగూర్, రఫీ, రవి, రాఘవరెడ్డి, మోహన్ నాయక్, ఎల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రమణ సేవలు మరువలేనివి



అసిస్టెంట్ మేనేజర్ రమణను సన్మానించిన అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ రమణ బ్యాంకు అభివృద్ధి కోసం చేసిన సేవలు మరువలేనివని బ్యాంకు ఆర్ఎం రమేష్ పేర్కొన్నారు. శనివారం రమణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆర్ఎం రమణ సేవలను కొనియాడారు. అనంతరం గ్రామంలో రమణ దంపతులను ఊరేగించి ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ చిత్తరంజన్‌రెడ్డి, బ్యాంకు చీఫ్ మేనేజర్లు చంద్రశేఖర్, పవన్‌కుమార్ , బ్యాంక్ మేనేజర్ సుభాషిని తదితరులు ప్రసంగించారు.

పుట్టపర్తి టౌన్: జిల్లా సమాచార శాఖ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవిప్రకాశ్‌రెడ్డి, జింకల రామన్న ఉద్యోగ విరమణ చేయడంతో స్థానిక ఎంపీపీ పాఠశాలలో శనివారం వారిని ఘనంగా సన్మానించారు. డీపీఆర్‌ఓ వేలాయుధం వారి సేవలను కొనియాడారు. సమాచార ఇంజనీరింగ్ శాఖ అధికారి రామాంజనేయులు, ఏపీఆర్‌ఓ ఫక్రొద్దీన్, విజయకుమార్, ఆర్టీసీ సూపరింటెండెంట్ ఉషారాణి, ప్రభావతి, సుహాషిణి, సావిత్రి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఉద్యోగ విరమణ చేయడంతో శనివారం ఆయన్ను మండలపరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను ఎంపీడీఓ సేవలు కొనియాడారు. తహసీల్దార్ అనంతాచారి, ఎస్.ఐ మల్లికార్జునరెడ్డి, కదిరి ఎంపీడీఓ పోలప్ప, వైఎస్సార్‌సీపీ నేత షామీర్ భాషా తదితరులు పాల్గొన్నారు .

కొత్తచెరువు: శ్రీసత్యసాయి జిల్లా ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు, ఉపాధ్యాయుడు పీవీ మాధవ్ శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. వక్తలు మాధవ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ నాయకులు చిన్న క్రిష్టారెడ్డి రాజేంద్రప్రసాద్, తలమర్ల కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఫండ్ నుంచి బిల్లులు చెల్లించొద్దు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ

ధర్మవరం రూరల్: మున్సిపల్ ఆదాయంతోనే అభివృద్ధికి ఖర్చు చేయాలని, కాంట్రాక్టర్లకు జనరల్ ఫండ్ నుంచి బిల్లులు చెల్లించొద్దని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయి, గజ్జల శివ, గోరకాటి పురుషోత్తంరెడ్డి తదతరులు మాట్లాడుతు మున్సిపల్ స్థలాలకు కంచె, స్తంభాలు నాటిన వివరాలు తెలపాలన్నారు. నాలుగు రోజుల్లో సమాచారం అందిస్తామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీకి మార్కెట్‌లో రూ.90 లక్షలు బకాయి ఉందని, ఎందుకు వసూలు చేయలేదని ప్రశ్నించారు. గతంలో మార్కెట్ దగ్గర మాత్రమే కాయగూరలు, చేపలు మాత్రమే కొనుగోలు చేయాలని తీర్మానం చేశామని, కాని ఇప్పుడు కాయగూరల మార్కెట్‌కు అవతల మార్కెట్‌లో ఉన్న షాపుల వారికి ఆదాయం లేకుండా పోతోందని, బాడుగ కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వెంటనే తోపుడు బండ్లు, బయట ఉన్న షాపులను వ్యాపారం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వార్డుల్లో కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ చైర్ పర్సన్ షంషాద్ బేగం, ఈఈ సాయికృష్ణ, డీఈ కళావతి, కృష్ణారావు, టీపీఆర్‌ఓ విజయభాస్కర్, టీపీఓ అలివేలమ్మ, ఆర్వో అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కదిరి టౌన్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా అధికారులకు సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతోందని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని కౌన్సిలర్ ఎమ్ఎస్ ఫయాజ్ కమిషనర్ కిరణ్ కుమార్‌ను కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు రాజశేఖరాచారి, సుధారాణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి పల్లకీసేవ



పల్లకీలో కొలువైన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శన్‌ఆచార్యులు ఉదయం స్వామికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వివిధ రకాల పూలు, తులసి మాలలతో స్వామికి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్నదానం చేశారు. సాయంత్రం భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు.

వ్యక్తిపై చాకులతో దాడి

కదిరి టౌన్: రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ వ్యక్తిపై కొందరు వ్యక్తులు చాకులతో దాడి చేశారు. వివరాలు..మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసం ఉన్న షేక్ ఇమామ్ సాబ్ కుమారుడు దాదాపీర్‌కు మైను, ముజ్జు, ఇనామ్, తన్వీర్, రఫిక్ మధ్య గొడవలున్నాయి. ఈనేపథ్యంలో శనివారం రాత్రి దాదాపీర్ రైల్వే స్టేషన్ రోడ్డులో ఉషారాణి ఆస్పత్రి ముందు నడుచుకుంటూ వెళ్తుండగా మైను, ముజ్జు, ఇనామ్, తన్వీర్, రఫిక్ అడ్డుతగిలి చాకులతో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి ప్రాథమిక చికత్స అనంతరం అనంతపురం తరలించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి అడ్మిషన్లు ప్రారంభం

తాడిమర్రి: మేడిమాకులపల్లి గ్రామం సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభం అవుతున్నట్లు ప్రిన్సిపాల్ డీ.మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ మార్కుల జాబితా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పొదుపు ఖాతా పుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకుని కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు

కనగానపల్లి: మండల పరిధిలోని ముక్తాపురం సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. శనివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి అనంతపురం వైపు రెండు లారీలు వెనుకా, ముందు వెళ్తున్నాయి. ఈ సందర్భంలో ముందు వెళ్తున్న లారీ టైరు అకస్మాత్తుగా పంచర్ కావడంతో వెంటనే ఆగిపోయింది. దీంతో వెనుక వైపే వస్తున్న లారీ.. ఆగిపోయిన లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీలు ఒక్కసారిగా రహదారి పక్కన ముళ్లపొదలోకి దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

వీధిదీపాల ఏర్పాటు

కదిరి అర్బన్: మండలంలోని గట్ల వద్ద ఉన్న కందికుంట కాలనీలో శనివారం విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ శుభలేఖ, ఎంపీడీఓ పోలప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు

రిటైర్డ్ ఎంఈఓ మృతి

కదిరి అర్బన్: పట్టణంలోని సైదాపురం కాలనీలో నివాసం ఉండే రిటైర్డ్ ఎంఈఓ కే. వేమారెడ్డి(75) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 1998లో కదిరి ఎంఈఓగా పని చేశారు. ఈయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ పెద్దన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్దన్న (58) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దన్న 2002 నుంచి 2006 వరకు బసంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. విషయం తెలుసుకున్న సానే ఉమారాణి, తదితరులు పెద్దన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ మృతికి సంతాపం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సెయింట్ మేరీస్ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ జాన్‌రెడ్డి శనివారం అనంతపురం సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చాంద్‌బాషా, అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి నరేంద్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారని వారు గుర్తు చేశారు.

కేసు నమోదు

ధర్మవరం అర్బన్: మహిళను వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప శనివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కాలవ పల్లవితో కొన్ని రోజులుగా ఆమె భర్త జనార్ధన్, అత్త శ్రీదేవి, ఆడపడుచులు భద్రావతి, హేమావతి అనవసరంగా గొడవ పడుతూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. విడాకులు ఇవ్వకుంటే చంపుతామని బెదిరించేవారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల గ్రామంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ గర్భ గుడిలో వేదమంత్రోచ్చారణలతో ప్రతిష్ట చేశారు. అనంతరం గ్రామస్తులు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట దినోత్సవం

తాడిమర్రి: దాడితోట గ్రామంలో చిత్రావతి నది ఒడ్డున వెలసిన బాట్లమ్మ తల్లి ఆలయంలో శనివారం భక్తులు అమ్మవారి 8వ విగ్రహ పతిష్టా దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాసులు శర్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి, బంగారు ఆభరణాలు అలంకరించి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడికట్టుదారులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు.